కడుపు నింపని కులవృత్తులు

- రెడీమేడ్ పనిముట్లతో కరువైన జవనోపాధి
- వ్యవసాయపనిముట్లకు తగ్గిన డిమాండ్
- కష్టాల కడలిలో ఆచార్ల బతుకులు


కొలిమి పనిచేస్తున్న ఆచార్లు

గుర్రంకొండ: పల్లె సీమల్లోని ప్రజలు ఒకప్పుడు కులవృత్తులతోనే జీవనం సాగించేవారు. ఏ చీకూ చింతా లేకుండా సాగిపోతున్న బతుకుబండి ప్రస్తుత ఆధునిక సమాజంలో ఒడిదుడుకులు ఎదుర్కొంటుంది. తరతరాలుగా అనుసరిస్తున్న కుల వృత్తులు ప్రస్తుతం కూడు పెట్టే పరిస్థితుల్లో లేవు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో కొలిమి పనిచేసే ఆచార్లకు మంచి ప్రాధాన్యం ఉండేది. రెడీమేడ్ సంస్కృతి మొదలైన తరువాత వారి జీవనోపాధి కష్టంగా మారింది. రైతుల దగ్గర నుంచి వ్యవసాయపనిముట్లకు డిమాండ్ తగ్గిపోయింది. దీంతో బతుకు భారంగా మారి నేడు పొట్టేళ్ల తలలు కాల్చుకొంటూ జీవనం సాగిస్తున్నారు. జిల్లాలో మొత్తం 18 వేల ఆచార్ల కుటుంబాలకు నేడు ఆదరణ కరువైంది.

రైతులతో అనుబంధం ఎక్కువ

రైతులతో వారికి అనుబంధం ఎక్కువగా ఉండేది. వ్యవసాయానికి అవసరమైన అన్ని పనిముట్లను కొలిమి దగ్గరే తయారు చేసేవారు. బండి చక్రాలు, ఇరుసులు, కొడవలి, గొడ్డలి, కోతకొడవలి, గడ్డితవ్వే గుద్దిళ్ళు, చెట్ల గుద్దిళ్ళు, పారలు, గడ్డపార కుమొనలు, మడక కార్లు లతో పాటు పలు రకాల పనిముట్ల ను తయారు చేయడంలో ఆచార్లు మంచి నేర్పరులు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తుంటారు. ఇనుము రైతులు తీసుకొచ్చి ఇస్తే తయారు చేసే పనిముట్లకు ఒక ధరలు, ఆచార్లు స్వయంగా తయారు చేసే పనిముట్లకు మరో ధరలు ఉంటాయి. గతంలో బండి చక్రాలకు రూ. 250, బండి ఇరుసుకు రూ.500, కొడవలి రూ.150, కోతకొడవలి రూ.70, గడ్డపారలు రూ.30, పార రూ. 100 మడక కార్లు రూ.50 ఇలా వ్యవసాయ పనిముట్లును బట్టి ఒక్కో రేటు నిర్ణయించేవారు. కుటుంబంలో నలుగురైదుగురు కష్టపడి కొలిమి పనిచేసేవారు. నాలుగు దశాబ్దాల కిందటే ప్రతిరోజు రూ.300 నుంచి రూ.400 వరకు సంపాదించేవారు. అప్పట్లో వారి బతుకులు మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లేవి.

రెడీమేడ్‌తో జీవనం అస్తవ్యస్తం

సమాజంలో రెడీమేడ్ సంస్కృతి రావడంతోనే వారి బతకులు అస్తవ్యస్థంగా మారాయి. వీరుతయారు చేసే పనిముట్లకు, మార్కెట్లో దొరికే రెడీమేడ్ పనిముట్ల ధరలకు చాలా వ్యత్యాసం ఉంటోంది. వ్యవసాయ పనిముట్లను తయారు చేయించుకొనే రైతులు ఆకాలంలో డబ్బులకు బదులుగా ధాన్యమో లేక గింజలో ఇచ్చేవారు. దీంతో కూటికి లోటు లేకుండా జీవనం సాఫీగా సాగిపోయేది. రోజురోజుకు నాగరికత పెరిగిపోతూ ఆధునిక పద్ధతులు మనిషి అలవాటు పడుతుండడంతో కులవృత్తులు కనుమరుగవుతున్నాయి. రెడీమేడ్ సంస్కృతితో అన్ని పనిముట్లు మార్కెట్‌లోకి వచ్చేశాయి. దీంతో కులవృత్తులు చేస్తూ జీవనం సాగించేవారి బతుకులు దుర్భరమయ్యాయి.

వారపు సంతల్లో దుకాణాలు

ఒకప్పుడు వ్యవసాయ పనిముట్లు అంటే ఆచార్ల దగ్గర మాత్రమే దొరికేవి. అలాగే వారు స్వయంగా తయారు చేసిన పనిముట్లను వారపు సంతల్లో దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయించేవారు. వీటితో పాటు ఇంటిఅవసరాలకు వినియోగించే కత్తులు, సూరకత్తులు, కత్తిపీటలు కుడా విక్రయించేవారు. ప్రస్తుతం ఈ వస్తువలన్ని దుకాణాల్లో లభిస్తున్నాయి. ప్రస్తుతం ఇవన్నీ హార్డ్‌వేర్స్ దుకాణాంలో విచ్చలవిడిగా దొరుకుతున్నాయి. వీటితో పాటు రైతులకు అవసరమైన కోత కొడవలి, మడక కార్లు, గడ్డపారలు, పారలు దుకాణాల్లో లభిస్తున్నాయి. దీంతో కులవృత్తులు చేసుకొనే ఆచార్లకు పనిలేకుండా పోతోంది. బండిచక్రాలు తయారు చేద్దామంటే ఇనుప కమ్ములతో తయారుచేసిన బండి చక్రాల స్థానంలో రబ్బరు టైర్లతో నడిచే బండ్లు, ట్రాక్టర్లు వచ్చేశాయి.ఈ దెబ్బతో చాలా మందికి జీవనం లేక కులవృత్తులను వదిలిపెట్టి ఇతర పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. మరికొందరు తరతరాలుగా వసున్న కులవృత్తులను వదిలలేక సతమతమవుతున్నారు.

పొట్టేలు తలలే జీవనాధారం

ప్రస్తుతం ఆచార్లు చాలా మంది పోట్టేళ్ల తలలు కాల్చి వచ్చే డబ్బులతో కడుపు నింపు కొంటున్నారు. గతంలో మాంసం ప్రియులు మేక, పోట్టేలు తలలు ఇళ్ళలోనే శుభ్రం చేసుకొనేవారు. అదికాస్తా భారంగా మారి నేడు కొలిమిలో ఇచ్చేస్తున్నారు. ఇక్కడ తలలను శుభ్రం చేసి ఇస్తే రూ: 100 నుంచి రూ. 150 ఆచార్లకు ఇస్తున్నారు. అదికూడా వారంలో రెండు రోజులు శుక్ర, ఆదివారాలలో మాత్రమే పొట్టేలు తలలు శుభ్రం చేస్తుంటారు.

ప్రత్యామ్నాయ జీవనం వైపు చూపు

కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగించే వారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందక పోవడంతో ప్రత్యామ్నాయ జీవనం వైపు చూస్తున్నారు. కొలిమి ఆచార్లకు ఎలాంటి బ్యాంకు రుణాలు అందడం లేదు. ఏదైనా చేసుకోవడానికి తగిన ఆర్థిక స్తోమత లేక ఇటు ప్రభుత్వ రుణాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చేసేదిలేక పలువురు ఆచార్లు తమ కులవృత్తులను వదిలేసి జీవనోపాధి కొసం ఇతర బతుకుదెరువు పనులకు వెళుతున్నారు.

కూలి గిట్టుబాటు కావడం లేదు



కొలిమి పనుల్లో రోజంతా కష్టపడినా కూలి గిట్టుబాటు కావడం లేదు. మా కుటుంబంలో ముగ్గురుతో పాటు మా బంధువులాయన కలసి మెత్తం నలుగురం పని చేసేవాళ్లం. కూలి గిట్టుబాటు కాక మాబంధువు పని మానేశాడు. కొలిమి దగ్గర వేడికి తట్టుకొని పనిచేస్తున్నా ప్రయోజనం లేదు. **- వెంకటేశ్వర, గుర్రంకొండ**

పొట్టకూటి కోసం తప్పడం లేదు



పొట్టనింపు కొవడానికే పోట్టేలు తలలు కాలుస్తున్నాం. కుటుంబాన్ని పోషించడానికి తప్పడం లేదు. ఒక్కో తలకు రూ.100 నుంచి రూ.150 ఇస్తారు. వారంలో రెండు రోజులు మాత్రమే పొట్టేలు తలలు కొలిమికి వస్తుంటాయి. కులవృత్తిలో ఎంత కష్టపడినా రోజువారీ కూలి గిట్టుబాటు కాక ఆపని చాలమంది మానేశారు. **- సురేంద్ర, గుర్రంకొండ**

చేతినిండా పని దొరకడం లేదు



మా కుటుంబం అంతా కొలిమి పనులు చేసుకొంటూ జీవనం సాగించేవాళ్లం. మారుతున్న కాలంలో మాకు చేతినిండా పనిదొరకడం లేదు. వ్యవసాయపనిముట్లు, ఇతర పరికరాలు రెడీమేడ్ వస్తువులుగా దుకాణాల్లో దొరుకుతున్నాయి. దీంతో మాకు పనులు చాలా వరకు తగ్గిపోయాయి. **- నాగరాజ, మొరంకొత్తపల్లె**

కార్యకర్తల వెన్నంటే ఉంటా

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


మంచూరులో కార్యకర్తలతో కలిసి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి (వాల్మీకిపురం): గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా నిత్యం కార్యకర్తల వెన్నంటే ఉంటానని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని మంచూరులో జరిగిన వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు షేక్ సయ్యద్ బాషా కుమారుడు షేక్ సాదిక్ వలీమా కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, కార్యకర్తలకు ఏలాంటి కష్టం వచ్చినా ముందుంటానన్నారు. కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, కూటమి నేతల దౌర్జన్యాలపై స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తే ఎవ్వరికైనా తగిన గుణపాఠం తప్పదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేక పోయిందన్నారు. ఏడు నెలలు గడుస్తున్నా సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసగించడం దారుణమన్నారు. నాయకులు, కార్యకర్తలు గ్రామ స్థాయిలో ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నారు. పార్టీ బలోపేతానికి కష్టపడ్డ ప్రతి నాయకుడు, కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల పార్టీ కన్వీనర్ నీళ్ళ భాస్కర్, వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డల కేశవ రెడ్డి, గోవర్ధన్, శ్రీనివాసులు, రామనాథం, రఘు, చిన్నానాయుడు, వెంకటస్వామిరెడ్డి, ముభారక్ తదితరులు పాల్గొన్నారు.

అండర్ డ్రైనేజ్ నిర్మాణ పనులు ప్రారంభం


అండర్ డ్రైనేజ్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీఈ చిన్నరెడ్డెప్ప

పీలేరు రూరల్ : నియోజకవర్గంలో మొట్టమొదటిసారిగా రూ. 22.50 లక్షలతో అండర్ డ్రైనేజ్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కె. చిన్నరెడ్డెప్ప తెలిపారు. సోమవారం మండలంలోని బోడుమల్లువారిపల్లె పంచాయతీ పరిధిలో తిరుపతి రోడ్డు మార్గంలో సప్తగిరి నగర్, మణికంఠ నగర్‌లో పైపులైను నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు అండర్ డ్రైనేజ్ కొరకు రూ. 3 కోట్లతో ప్రతిపాదనలు పంపగా మొదటి విడతగా రూ. 22.50 లక్షలతో 500 మీటర్లు అండర్ డ్రైనేజ్ నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. దీని ద్వారా మెయింటెనెన్స్ ఖర్చు తక్కుతుందని, పది మీటర్లకు ఒక చోట మెన్‌హోల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇరగన్న పాల్గొన్నారు.

భూముల రీసర్వే పారదర్శకంగా నిర్వహించండి


మాట్లాడుతున్న తహసీల్దార్ భీమేశ్వర్ రావు

పీలేరు రూరల్ : భూముల రీసర్వే పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు అన్నారు. సోమవారం రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని వేపులబైలులో ఈ నెల 23 నుంచి మూడో విడత భూరీసర్వే జరుగుతుందని, రైతులు కూడా ఇందుకు సహకరించాలని కోరారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం 26 అర్జీలు వచ్చాయని, వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కరించాలని ఇదేశించారు. సమావేశంలో డీటీ సుబ్రమణ్యం, సర్వేయర్ కిరణ్మయి, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్‌లో ఉచిత కంటి పరీక్షలు


కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ నివేదిత

మదనపల్లె సిటీ: స్థానిక సొసైటీకాలనీలోని లయన్స్ క్లబ్‌లో సోమవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు నిర్వహించి 25 మందికి శస్త్రచికిత్సలు చేశారు. కంటి వైద్యులు డాక్టర్ నివేదిత కంటి పరీక్షలు నిర్వహించి సలహాలు,సూచనలు ఇచ్చారు. కంటిలో పొరలు, శుక్లాలతో ఇబ్బంది పడుతున్న వారికి లయన్స్ క్లబ్‌నందు జరిగే ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని లయన్ క్లబ్ జోనల్ చైర్మన్ అప్పినపల్లి భాస్కారాచారి తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పీఆర్ఓ గౌతమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘లోకేష్ అనేక సంస్కరణలు తీసుకొచ్చారు’

మదనపల్లె : రానున్న రోజుల్లో ఏపీకి కాబోయే ముఖ్యమంత్రి నారాలోకేష్ అని రాజంపేట పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు అన్నారు. సోమవారం రాజంపేట టీడీపీ పార్లమెంటరీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ కష్టకాలంలో ఉన్నప్పుడు లోకేష్‌బాబు మొక్కవోని దీక్షతో కార్యకర్తలకు ఎంతో ధైర్యాన్నిచ్చి, తానున్నానని, ముందుండి నడిపించి, అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు.

ఉరుసు ప్రారంభం


చెంబకూర్ క్రాస్‌లో ఉరుసుకు ముస్తాబైన దర్గా

రామసముద్రం : మండలంలోని చెంబకూరు క్రాస్‌లోని హజరత్ సుల్తాన్ చమన్ దార్ అలీషా హుసేని ఖాదరి వారి 37వ ఉరుసేషరీఫ్ కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఫకీర్ల రాతీబ్‌లతో బాణాసంచా , మద్రాస్ వారి బ్యాండ్ మేళాలు, విద్యుత్ దీపాలంకరణతో రాత్రి 8 గంటలకు గంధం తాజియా ఊరేగింపు జరిగింది. మంగళవారం రాత్రి ఉరుసు, గొప్ప ఖవాలి పాట కచ్చేరి జరుగుతుందని దర్గా కమిటీ సభ్యులు, కార్య నిర్వాహకులు తెలిపారు.

పశు ఆరోగ్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి


పాడిరైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారి సునీల్ నాయక్

గుర్రంకొండ: పశు ఆరోగ్యశిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి సునీల్ నాయక్ అన్నారు. సోమవారం మండలకేంద్రమైన గుర్రంకొండలోని కొత్తపేట, తాళీం వీధుల్లో పశుఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈసందర్భంగా పాడిఆవులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న శిబిరాల్లో పాడిఆవులకు అన్ని రకాల వైద్యసేవలను ఉచితంగా అందిస్తామన్నారు. పాడి ఆవుల కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో తరిగొండ పశువైద్యాధికారి దీపిక, సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

రుణాల మంజూరు సరే..దరఖాస్తు మాటేమిటి ?

పెద్దతిప్పసముద్రం: మండలానికి బీసీ కార్పొరేషన్ రుణాలు మంజూరైనట్లు ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ సోమవారం తెలిపారు. 50 శాతం రాయితీ, 50 శాతం బ్యాంకు రుణం ఉంటుందని, అర్హులైన నిరుద్యోగులు స్వయం ఉపాధి యూనిట్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ సూచించారు. ప్రభుత్వ ప్రకటనలు, రాయితీ రుణాల మంజూరు సరే.. దరఖాస్తు ఎక్కడ చేసుకోవాలి అని ఆశావహులు అయోమయంలో పడ్డారు. దరఖాస్తు చేసేందుకు లబ్ధిదారులు సమీపంలోని ఇంటర్‌నెట్ కేంద్రాలకు వెళితే సదరు సైట్ ఓపన్ కావడం లేదని చెప్పడంతో వారంతా దిక్కుతోచక జుట్టు పీక్కుంటున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు లబ్ధిదారులు అన్ని ధ్రువపత్రాలు తమ వద్ద సిద్ధంగా ఉంచుకున్నా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోందని వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెబ్‌సైట్ తెరచుకునేలా చొరవ చూపడంతో పాటు దరఖాస్తు గడువును పొడిగించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు పరికరాలు ఇవ్వాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మదనపల్లె : మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు, పాడైపోయిన పనిముట్ల స్థానంలో కొత్తవి ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మస్తాన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడై పోయిన పని ముట్లతో పారిశుద్ధ్య కార్మికులు పనులు చేయడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల, జిల్లా ఉపాధ్యక్షుడు దేవా, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ముబారక్, ఇంద్రాణి, పృథ్వి రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాథ్స్ మోడల్ ప్రశ్నపత్రాలు పంపిణీ


మ్యాథ్స్ మోడల్ ప్రశ్నాపత్రాలు ఆవిష్కరిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

మదనపల్లె సిటీ: పదో తరగతి విద్యార్థులకు ఉపయోగార్థం ఏపీ మ్యాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో మ్యాథ్స్ మోడల్ ప్రశ్నాపత్రాలను సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఏపీ మ్యాథ్స్ ఫోరం నామా చంద్రశేఖర్ ప్రత్యేకంగా తయారు చేశారు. స్లో లెర్నర్ కూడా కచ్చితంగా పాస్ అయ్యే విధంగా గణితంలో 50 ప్రశ్నలు తయారు చేయడం జరిగింది. 50 ప్రశ్నలు కలిగిన 6 పేజీలను జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలలకు కనీసం మూడు సెట్లు చేరే విధంగా వెయ్యి కాపీలను సిద్ధం చేసినట్లు వాసవీ క్లబ్ అధ్యక్షులు అమరనాథ్ తెలిపారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ కారదర్శి మునిరాజు, కోశాధికారి కిషోర్ బాబు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఓ ప్లాంట్ల ఆపరేటర్లకు అందని జీతాలు


పీలేరు పట్టణంలోని ఆర్‌ఓ ప్లాంట్

పీలేరు : ప్రజలకు మంచినీరు అందించే సదుద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రత్యేక చొరవ చూపి మండలంలో 40 ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఆర్‌వో ప్లాంట్ల నిర్వహణకు ఒక్కో ప్లాంటుకు ఒక్కరు చొప్పున ఆపరేటర్లను నియమించారు. అప్పట్లో ప్రతి నెలా జీతాలు అందేవి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఆపరేటర్లకు జీతాలు సక్రమంగా ఇవ్వడం మానేశారు. ఆరు నెలలకు సంబంధించి జీతాలు అందకపోవడంతో ఆపరేటర్లు కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పీలేరు పట్టణంలో 25 మంది ఆపరేటర్లు పని చేస్తున్నారు. జీతాలు అందలేదని ప్రశ్నిస్తే విధుల నుంచి తొలగిస్తామని పంచాయతీ అధికారులు బెదిరించే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ


కుష్టు నివారణపై అవగాహన ర్యాలీ

పీలేరు : మండలంలోని తలపుల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కుష్ట వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సోమవారం మండలంలోని తలపులలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ స్పర్శలేని మచ్చలు కుష్టు వ్యాధి కావచ్చునని, గుర్తించిన సమీప పీహెచ్‌సీలో సంప్రదించి నిర్ధారణ పరీక్షలు చేపించుకోవాలని సూచించారు. కుష్టువ్యాధి నిర్మూలనకు మందులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్ సైన్సుకు డిమాండ్

మదనపల్లె సిటీ: ఆధునిక సమాజంలో కంప్యూటర్ సైన్సుకు ఎంతో డిమాండ్ ఉందని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. సోమవారం కాలేజీలో ఏడబ్ల్యుఎస్ క్లౌడ్ కంప్యూటింగ్‌పై సెమినార్ నిర్వహించారు. క్లౌడ్ కంప్యూటింగ్ అభివృద్ధి చెందుతున్న,రీసెర్చ్ స్కాలర్లను సన్నద్ధం చేయడం కార్యక్రమం లక్ష్యమన్నారు. ప్రోగ్రామ్ లక్ష్యాలు, ఫలితాలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,డేటా సైన్సు గురించి వివరించారు. క్లౌడ్ కంప్యూటింగ్ వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీష్, కో ఆర్డినేటర్ మహమ్మద్ షఫీ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

24న డయల్ యువర్ డీఎం

మదనపల్లె సిటీ: ప్రయాణికుల సమస్యలు, ఆర్టీసీ ఆదాయం పెంచుటకు తగిన సూచనలు,సలహాలు ఇచ్చేందుకు ఈనెల 24వతేదీతన వన్, టు డిపోల్లో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ సీఐ రేవతి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రయాణికులు 9959225676 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేవచ్చునన్నారు.

27 లక్కీ డ్రా

మదనపల్లె-బి.కొత్తకోట రూట్ నందు ఈనెల 27వతేదీన లక్కీ డ్రా తీయనున్నట్లు ఆర్టీసీ సీఐ రేవతి తెలిపారు. ఈ రూట్ నందు ప్రయాణించే ప్రయాణికులు టిక్కెట్టుపై తమ పేరు, మొబైల్ నంబర్ రాసి గిఫ్ట్ బాక్సులో వేయాలన్నారు.డ్రాలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు.

లైబ్రరీ, సైన్స్ ల్యాబ్‌లకు భూమి పూజ

మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పీఎం శ్రీ నిధి కింద రూ.48 లక్షలతో లైబ్రరీ, సైన్సు ల్యాబ్‌లకు సోమవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు పీఎం శ్రీ కింద ఎంపిక కావడం జరిగిందన్నారు. దీంతో పాఠశాలలో మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, హెచ్‌ఎం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సచివాలయం తనిఖీ

పెద్దతిప్పసముద్రం: ప్రతి ఒక్కరూ విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన మండలంలోని మల్లెల సచివాలయాన్ని అకస్మికంగా తనిఖీ చేసి చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అనంతరం ఆయన గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి మస్టర్లను తనిఖీ చేశారు. కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శ్రీనేలమల్లేశ్వరస్వామి హుండీ ఆదాయం లెక్కింపు

నిమ్మనపల్లె : మండలంలోని తవళం గ్రామంలో వెలసిన శ్రీ నేలమల్లేశ్వర స్వామి ఆలయానికి రూ. 1,04,776 లు ఆదాయం వచ్చినట్లు ఈఓ మంజుల తెలిపారు. సోమవారం మదనపల్లి డివిజన్ దేవాదాయ శాఖ తనిఖీ అధికారి ఎస్.శశి కుమార్, ఆలయ ఈఓ మంజుల ఆధ్వర్యంలో హుండీ ఆదాయం లెక్కింపు చేపట్టారు. ఈ సందర్భంగా ఈఓ మంజుల మాట్లాడుతూ ఐదు నెలలు (సెప్టెంబర్ నుంచి జనవరి) లకు హుండీ ఆదాయం లెక్కించినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని దేవాలయానికి సంబంధించిన ఇండియన్ బ్యాంక్ అకౌంట్, వాల్మీకిపురంలో జమచేసి ఆలయ అభివద్దికి ఉపయోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.రెడ్డప్ప, మాజీ సర్పంచ్ రాజన్న, మాజీ ఎంపిపి మేష రామకృష్ణ, ఆలయ అర్చకులు శంకర స్వామి, దేవాదాయశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులకు నివేదికలు ఇవ్వండి

బి.కొత్తకోట: జిల్లా పరిషత్ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి ఇంకనూ చెల్లించని బిల్లుల నివేదికలను ఈనెల 31లోగా చిత్తూరు జెడ్పీ కార్యాలయానికి నివేదించాలని సీఈఓ వి.రవినాయుడు ఉమ్మడిచిత్తూరు జిల్లాకు చెందిన ఎంపీడీఓలకు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. 2018–19 ఆర్థిక సంవత్సరం నుంచి 2023–24 ఆర్థిక సంవత్సరం వరకు జరిగిన అభివృద్ధి పనులు పూర్తి పెండింగ్‌లో ఉన్న బిల్లుల వివరాలు, వాటి రికార్డులను సత్వరమే సమర్పించాలని ఆదేశాల్లో సూచించారు. ఈనెల 31లోగా బిల్లులు ఇవ్వాలని ఆ తర్వాత బిల్లులు నివేదికలను తీసుకోవడం జరగదని ఉత్తర్వులో పేర్కొన్నారు.

స్పెషల్ ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ, గుర్రంకొండ గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశులు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గుర్రంకొండ తెలుగు జెడ్పీహైస్కూల్, తరిగొండ సచివాలయ భవనాల్లో ఈనెల 21 నుంచి 24 వరకు మొదటి విడత, ఈనెల 27 నుంచి 30 వరకు రెండవ విడతగా ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల ప్రజలు ఈ రెండు ఆధార్ కేంద్రాల్లో తమ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పశుపోషణలో మెలకువలు పాటించాలి


నట్టల నివారణ మందు తాపుతున్న పశువైద్య సిబ్బంది

తంబళ్లపల్లె: పశుపోషణలో పాడి రైతులు, జీవాల పెంపకందారులు ముందస్తు మెలకువలు పాటించాలని పశుసంవర్ధశాఖ ఏడీ సుమిత్ర తెలిపారు. సోమవారం తంబళ్లపల్లె మండలంలోని కుక్కరాజుపల్లె, పంచాలమర్రి, పెద్దమండ్యం మండలంలోని రెక్కలకొండపల్లె, పాతదాసగారిపల్లె రైతు సేవా కేంద్రాల వద్ద ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. డాక్టర్లు విక్రమ్‌రెడ్డి, ఉస్మాన్, ఎంపీసీ డాక్టర్ ఇందు 54 పశువులకు గర్భకోశ పరీక్షలు చేశారు. 352 ఆవులకు,129 దూడలకు 2,545 గొర్రెలకు నట్టల నివారణ మందు తాపారు. రైతులకు పశుపోషణ సూచనలు ఇచ్చి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో యూనియన్ నూతన కమిటీ ఎన్నిక


ఆటో యూనియన్ నూతన కమిటీ సభ్యులు

ములకలచెరువు: స్థానిక మండల కేంద్రం ఆర్టీసీ బస్టాండు ఎదురుగా అంబేద్కర్ ఆటో యూనియన్ నూతన కమిటీ సోమవారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా బయన్నను ఏకాగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా ఆదినారాయణ, రెడ్డిబాషా, నవీన్, ఇలియాజ్‌లను ఎన్నుకున్నారు. ఆటో కార్మికుల సమస్యలపై పోరాడుతామని ఈ సందర్భంగా వారు తెలిపారు.